నమస్తే తెలంగాణ
రంగారెడ్డి
13 | హైదరాబాద్, శుక్రవారం 19 జనవరి 2024 | RANGAREDDY



- బీఆర్ఎస్ శ్రేణులకు పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ పిలుపు
- పార్లమెంట్ ఎన్నికల్లో గెలుపే లక్ష్యంగా ముందుకు..
- తెలంగాణభవన్‌లో మహబూబ్‌నగర్ పార్లమెంట్ సన్నాహక సమావేశం
- హాజరైన ఉమ్మడి జిల్లాలోని ప్రజాప్రతినిధులు, పార్టీ శ్రేణులు
- లోక్‌సభ ఎన్నికల్లో గెలుపు వ్యూహాలపై చర్చ

# సత్తా చాటాలి

రంగారెడ్డి, జనవరి 18 (నమస్తే తెలంగాణ): రానున్న లోక్‌సభ ఎన్నికల్లో గెలుపే లక్ష్యంగా బీఆర్ఎస్ పార్టీ ముందుకెళ్తున్నది. ఇందుకోసం పార్లమెంట్ నియోజకవర్గ సన్నాహక సమావేశాలు నిర్వహిస్తున్నది. గురువారం తెలంగాణభవన్‌లో మహబూబ్‌నగర్ పార్లమెంట్ సన్నాహక సమావేశం బీఆర్ఎస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్, మాజీ మంత్రి కేటీఆర్ ఆధ్వర్యంలో జరిగింది. దీనికి పార్లమెంట్ పరిధిలోని ఏడు అసెంబ్లీ నియోజకవర్గాలకు చెందిన తాజా, మాజీ ప్రజాప్రతినిధులు, పార్టీ శ్రేణులు అధిక సంఖ్యలో హాజరయ్యారు. లోక్‌సభ ఎన్నికల కార్యాచరణ, గెలుపు వ్యూహాలపై చర్చించారు. ఈ సందర్భంగా పార్టీ శ్రేణుల నుంచి అభిప్రాయాలను సేకరించారు. పార్లమెంట్ ఎన్నికల్లో బీఆర్ఎస్ పార్టీ సత్తాచాటాలని కేటీఆర్ పార్టీ శ్రేణులకు పిలుపునిచ్చారు.

### ఎంపీ సీటు గెలుపుపై దిశానిర్దేశం..

మహబూబ్‌నగర్ ఎంపీ స్థానాన్ని బీఆర్ఎస్ పార్టీ 2009 నుంచి వరుసగా గెలుస్తూ వస్తున్నదని.. ఈసారి కూడా గెలిచేలా పార్టీ శ్రేణులు రెట్టించిన ఉత్సాహంతో పనిచేయాలని కేటీఆర్ పేర్కొన్నారు. అసెంబ్లీ ఎన్నికల సందర్భంగా కాంగ్రెస్ పార్టీ ప్రజలకు ఇచ్చిన 420 హామీలకు సంబంధించిన బుక్‌లెట్లను సమావేశానికి వచ్చిన ప్రతి ఒక్కరికీ అందజేశారు. ఈ సందర్భంగా షాద్‌నగర్ అసెంబ్లీ ఎన్నికల ఫలితాలపై సమీక్షించారు. స్వల్ప ఓట్ల తేడాతో ఓటమి పాలయ్యామని, పార్టీ శ్రేణులు నిరాశ చెందొద్దని సూచించారు. లోక్‌సభ ఎన్నికలో బీఆర్ఎస్ అభ్యర్థి గెలుపునకు కలిసికట్టుగా పనిచేయాలని కోరారు. పాలమూరు–రంగారెడ్డి ప్రాజెక్టుకు జాతీయ హోదా తీసుకొస్తామన్న కాంగ్రెస్ పార్టీ చేతులెత్తేసిందని మాజీ మంత్రి కేటీఆర్ ఎద్దేవా చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వంపై కొద్ది రోజుల్లోనే అనేక వర్గాలు అసంతృప్తితో ఉన్నాయన్నాయని..ఎరువుల కోసం రైతులు క్యూలో నిలబడే రోజులు మళ్లీ వచ్చాయని.. ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన హామీలను గుర్తు చేసేలా ప్రజలను చైతన్యపర్చాలని పార్టీ శ్రేణులకు సూచించారు. ఇదే పరిస్థితి కొనసాగితే ఆరు నెలల్లో ప్రభుత్వంపై ప్రజలు తిరగబడే పరిస్థితి వస్తుందన్నారు. పదేండ్లు రాష్ట్రాభివృద్ధికి కృషి చేసిన బీఆర్ఎస్ ప్రభుత్వంపై కాంగ్రెస్ దుష్ప్రచారానికి తెరలేపిందని..బీఆర్ఎస్ ప్రభుత్వం అప్పులు కాదు కోట్లాది రూపాయల ఆస్తులను సృష్టించిందని ఆయన స్పష్టం చేశారు. ప్రజలకు ఇచ్చిన హామీలను ఎగ్గొట్టేందుకే కాంగ్రెస్ శ్వేతపత్రాలతో నాటకాలు మొదలుపెట్టిందని ఆరోపించారు. పార్లమెంట్ సన్నాహక సమావేశాల్లో పార్టీ కార్యకర్తలు, నాయకుల నుంచి వచ్చే ఫీడ్‌బ్యాక్‌ను పార్టీ అధినేత కేసీఆర్ దృష్టికి తీసుకెళ్తామన్నారు. గెలిచినప్పుడు పొంగిపోలేదని.. ఓటమికి కుంగిపోమని..ఎప్పుడైనా ప్రజాప్రయోజనాల కోసమే మన పార్టీ పని చేస్తుందని తెలిపారు. గత కాంగ్రెస్ ప్రభుత్వంలో పింఛన్ల కోసం ఏటా రూ.800 కోట్లు ఖర్చు పెడితే, బీఆర్ఎస్ ప్రభుత్వం రూ. 11,700 కోట్లను ఖర్చు పెట్టిందన్నారు. అదే విధంగా గ్రామ పంచాయతీ నుంచి పార్లమెంట్ వరకు ప్రతి చోటా పార్టీకి బలమైన నాయకత్వం ఉన్నదని.. ఇంతటి బలమైన పార్టీ తిరిగి గెలుపుబాట పట్టడం పెద్ద కష్టమేమీకాదని శ్రేణులకు మాజీ మంత్రి కేటీఆర్ సూచించారు.

సమావేశంలో మహబూబ్‌నగర్ ఎంపీ మన్నె శ్రీనివాస్‌రెడ్డి, మాజీ మంత్రులు నిరంజన్‌రెడ్డి, శ్రీనివాస్‌గౌడ్, మాజీ ఎమ్మెల్యేలు అంజయ్యయాదవ్, పట్నం నరేందర్‌రెడ్డి, మున్సిపల్ చైర్మన్ నరేందర్, వైస్ చైర్మన్ నటరాజ్, మాజీ చైర్మన్ విశ్వం, సహకార సంఘాల మాజీ చైర్మన్ రాజావరప్రసాద్, ఎస్సీ, ఎస్టీ కమిషన్ మాజీ సభ్యుడు రాంబాల్‌నాయక్, కేశంపేట ఎంపీపీ రవీందర్‌యాదవ్, జడ్పీ మాజీ వైస్ చైర్మన్ నవీన్‌రెడ్డి, నాయకులు శ్రీనివాస్‌రెడ్డి, నారాయణరెడ్డి, వెంకట్‌రెడ్డి, లక్ష్మీనారాయణ, మురళీధర్, లక్ష్మణ్, యాదయ్య, వీరేశం, సాయిప్రసాద్ ,కొడంగల్ నియోజకవర్గ ముఖ్యనేతలు పాల్గొన్నారు.

పార్లమెంటు ఎన్నికల కోసం బీఆర్ఎస్ పార్టీ అన్ని పార్టీల కంటే ముందుగానే సమాయత్తమైనది. ఇందులో భాగంగా జనవరి 3వ తేదీ నుంచి పార్లమెంట్ నియోజకవర్గాల వారీగా సన్నాహక సమావేశాలను తెలంగాణ భవన్‌లో నిర్వహిస్తున్నది. జనవరి 5న చేవెళ్ల, 12న భువనగిరి, 17న నాగర్‌కర్నూల్, 18న మహబూబ్‌నగర్ పార్లమెంట్ నియోజకవర్గాల సన్నాహక సమావేశాలను నిర్వహించినది. పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్, కేటీఆర్, పార్టీ సెక్రటరీ జనరల్ కేశవరావు,

**పార్టీ శ్రేణుల్లో జోష్ నింపిన సమావేశాలు**

మాజీ మంత్రి హరీశ్‌రావు తదితరులు ఈ సమావేశాల్లో పాల్గొని తాజా, మాజీ నేతలకు దిశానిర్దేశం చేశారు. అసెంబ్లీ ఎన్నికల్లో ఓటమికి గల కారణాలు, ప్రస్తుత లోక్‌సభ ఎన్నికల్లో గెలుపునకు చేపట్టాల్సిన కార్యాచరణపై చర్చించారు. అసెంబ్లీ ఎన్నికలతో నైరాశ్యంలో ఉన్న కేడర్‌లో జోష్ నింపేందుకు సన్నాహక సమావేశాలు ఎంతో దోహదపడ్డాయని పార్టీ నేతలు పేర్కొంటున్నారు.



సమావేశానికి హాజరైన ఉమ్మడి జిల్లాకు చెందిన బీఆర్ఎస్ శ్రేణులు, ప్రజాప్రతినిధులు

## మగవారికి 50శాతం సీట్లు కేటాయించండి

**డయల్ యువర్ డీఎంకు 25 ఫిర్యాదులు**



ఫిర్యాదులు స్వీకరిస్తున్న డీఎం ఉష

షాద్‌నగర్‌టౌన్, జనవరి 18 : ఆర్టీసీ బస్సుల్లో మగవారికి 50శాతం సీట్లు కేటాయించాలని ప్రయాణికులు డయల్ యువర్ డీఎం కార్యక్రమం ద్వారా ఫిర్యాదు చేసినట్లు షాద్‌నగర్ ఆర్టీసీ డీఎం ఉష తెలిపారు. గురువారం డిపోలో నిర్వహించిన డయల్ యువర్ డీఎం కార్యక్రమానికి 25 ఫిర్యాదులు వచ్చాయన్నారు. ప్రభుత్వం మహిళలకు ఫ్రీ బస్సు సౌకర్యం కల్పించడంతో మగవారు ఇబ్బందులు పడుతున్నట్లు ఫిర్యాదుల్లో పేర్కొన్నారు. మహిళా ఉద్యోగినులకు ఉచిత ప్రయాణాన్ని ఉపసంహరించుకోవాలన్నారు. అదేవిధంగా చౌడాపూర్‌కు బస్సును పునరుద్ధరించాలని.. పలు గ్రామాలకు బస్సుల సంఖ్యను పెంచాలని కోరారు. వచ్చిన ఫిర్యాదులను ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కారానికి కృషి చేస్తానని ఆమె తెలిపారు.




సమావేశంలో మాట్లాడుతున్న మంత్రి పొన్నం ప్రభాకర్

మన్నెగూడలో రవాణాశాఖ కార్యాలయం ప్రారంభం

## మహిళా సంక్షేమానికి
# పెద్దపీట

- ఇచ్చిన హామీ మేరకే ఆర్టీసీ బస్సుల్లో ఉచిత ప్రయాణం కల్పించాం
- రాష్ట్ర రవాణా, వెనుకబడిన తరగతుల శాఖల మంత్రి పొన్నం ప్రభాకర్

ఇబ్రహీంపట్నం, జనవరి 18 : కాంగ్రెస్ ప్రభుత్వం మహిళల సంక్షేమానికి పెద్దపీట వేసిందని రాష్ట్ర రవాణా, వెనుకబడిన తరగతుల శాఖల మంత్రి పొన్నం ప్రభాకర్ అన్నారు. గురువారం తుర్కయంజాల్ మున్సిపాలిటీ పరిధిలోని మన్నెగూడ గ్రామంలో రామోజీ ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ప్రాంతీయ కార్యాలయ భవనాన్ని ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో మంత్రి మాట్లాడుతూ.. ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు అధికారంలోకి వచ్చిన వెంటనే మహిళలకు ఆర్టీసీ బస్సుల్లో ఉచిత ప్రయాణాన్ని కల్పించినట్లు గుర్తుచేశారు. ప్రభుత్వం ద్వారా ఇచ్చే సబ్సిడీ గ్యాస్, రేషన్ కార్డులు, ఇండ్ల స్థలాలను మహిళల పేర్ల మీదనే పంపిణీ చేస్తామన్నారు. ప్రజాపాలన ద్వారా వచ్చిన దరఖాస్తులను పరిశీలించి అర్హులందరికీ పథకాలను అందిస్తామన్నారు. మహిళలకు ఉచిత ప్రయాణం ద్వారా మెట్రో, ఆటోలు, ఇతర వాహనాలకు ఇబ్బంది కలిగిందని జరుగుతున్న ప్రచారం తప్పన్నారు. ఆటోయూనియన్లతో చర్చలు జరుపుతున్నామని, అందరికీ న్యాయం చేస్తామని చెప్పారు.

### రోడ్డు భద్రతా కార్యక్రమాలు..

రాష్ట్రంలో పెరుగుతున్న వాహనాల దృష్ట్యా జరుగుతున్న రోడ్డు ప్రమాదాలను అరికట్టేందుకు నేటి నుంచి రోడ్డు భద్రతా కార్యక్రమాలను చేపడుతున్నట్లు మంత్రి పొన్నం ప్రభాకర్ తెలిపారు. దీనికి సంబంధించిన వాల్‌పోస్టర్‌ను ఇబ్రహీంపట్నం ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డితో కలిసి ఆవిష్కరించి మాట్లాడారు. గతేడాది రాష్ట్రంలో 22 వేల రోడ్డు ప్రమాదాలు జరుగగా సుమారు 3 వేల మందికి పైగా మృతిచెందగా వేలాది మంది క్షతగాత్రులయ్యారన్నారు. అనంతరం ఇబ్రహీంపట్నం ఎమ్మెల్యే రంగారెడ్డి మాట్లాడుతూ ఇబ్రహీంపట్నం ప్రాంతీయ కార్యాలయంలో మరిన్ని సేవలు కల్పించేందుకు ప్రభుత్వం తీసుకున్న నిర్ణయం ఎంతో అభినందనీయమన్నారు.



మన్నెగూడలో ఆర్టీవో కార్యాలయాన్ని ప్రారంభిస్తున్న రామోజీ ఫౌండేషన్ ఎండీ విజయేశ్వరి

రామోజీ ఫౌండేషన్ రూ.2.15 కోట్లతో నూతన భవనాన్ని నిర్మించి ఇవ్వటాన్ని ఆయన స్వాగతించారు. సాగర్ రహదారి నుంచి ఆర్టీఏ కార్యాలయానికి రోడ్డు సౌకర్యం కల్పించాలని కలెక్టర్‌ను కోరారు. ముఖ్యంగా ఇబ్రహీంపట్నం ప్రాంతంలో త్వరలోనే మరిన్ని పరిశ్రమలు ఏర్పాటు కానున్నాయన్నారు. సాగర్ రహదారి నుంచి ఆర్టీఏ కార్యాలయానికి త్వరలోనే రోడ్డు సౌకర్యం కల్పిస్తామని కలెక్టర్ శశాంక తెలిపారు. కార్యక్రమంలో రంగారెడ్డి జడ్పీ చైర్‌పర్సన్ తీగల అనితారెడ్డి, ఎమ్మెల్సీలు దయానంద్, ఎగ్గె మల్లేషం, రామోజీ ఫౌండేషన్ ఎండీ విజయేశ్వరి, తుర్కయంజాల్ మున్సిపల్ చైర్‌పర్సన్ అనురాధ, కాంగ్రెస్‌పార్టీ నాయకుడు మల్‌రెడ్డి రాంరెడ్డి, ఇబ్రహీంపట్నం జడ్పీటీసీ మహిపాల్, అబ్దుల్లాపూర్‌మెట్ జడ్పీటీసీ దాసు, నాయకులు గురునాథ్‌రెడ్డి, మధు, మున్సిపల్ వైస్‌చైర్మన్ హరిత, ప్రిన్సిపాల్ సెక్రటరీ శ్రీనివాస్‌రాజు, ఇబ్రహీంపట్నం ఆర్టీవో రఘునందన్‌గౌడ్, రంగారెడ్డి డీటీసీ ప్రవీణ్, తదితరులు పాల్గొన్నారు.

# సొంతానికి వాడుకున్నారు..

- మహిళా సంఘం లోన్ అవకతవకలపై అధికారులు, గ్రామస్తుల సమక్షంలో ఏపీఎం విచారణ
- డబ్బులు మళ్లించినట్లు ఒప్పుకున్న బుక్‌కీపర్ మల్లేశం
- ఫిబ్రవరి ఒకటిలోగా డబ్బు చెల్లిస్తానని హామీ

దోమ, జనవరి 18 : మహిళా సంఘం రుణాల అవకతవకలపై బుక్‌కీపర్ చేతివాటం అనే వార్తకు స్పందించిన ఇందిరా క్రాంతి పథకం (ఐకేపీ)కార్యాలయ అధికారి ఏపీఎం సురేశ్ విచారణ చేపట్టారు. గురువారం ఆయన మోత్కూర్ గ్రామానికి చేరుకొని బాధిత శివశ్రీ మహిళా సంఘం సభ్యులతోపాటు గ్రామస్తుల సమక్షంలో విచారించగా బుక్‌కీపర్ కటికె మల్లేశం తన భార్య ఖాతాకు రూ. 2.50,000 మళ్లించి వాడుకున్నది నిజమేనని తేలింది. ఆ డబ్బును వడ్డీతో కలిపి చెల్లిస్తానని అధికారులు, గ్రామస్తుల సమక్షంలో అతడు ఒప్పుకున్నాడు. కాగా బాధిత మహిళా సంఘం సభ్యులకు రూ. పది వేలు రీపేమెంట్ చేయ గా .. మిగిలిన డబ్బును ఫిబ్రవరి 1లోగా సంఘం ఖాతాకు జమ చేస్తానని మల్లేశం ఒప్పుకున్నట్లు ఏపీఎం సురేశ్ తెలిపారు. గడువులోగా మిగతా డబ్బును చెల్లించకపోతే మల్లేశంపై చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. కార్యక్రమంలో సీసీ నారాయణ, మండల మహిళా సమాఖ్య అధ్యక్షురాలు జ్యోతి, అకౌంటెంట్ మంజుల, మహిళా సంఘాల సభ్యులు, గ్రామస్తులు పాల్గొన్నారు.



మోత్కూర్‌లో లోన్ రికవరీపై విచారణ చేపడుతున్న ఐకేపీ అధికారులు, స్వయం సహాయక సంఘాల సభ్యులు, గ్రామస్తులు

## ఓటరు జాబితా సవరణను
# పకడ్బందీగా చేపట్టాలి

**రంగారెడ్డి కలెక్టర్ శశాంక**

సమావేశంలో మాట్లాడుతున్న రంగారెడ్డి కలెక్టర్ శశాంక



ఇబ్రహీంపట్నం, జనవరి 18 : ఓటరు జాబితా సవరణ ప్రక్రియను పకడ్బందీగా చేపట్టాలని రంగారెడ్డి కలెక్టర్ శశాంక అన్నారు. గురువారం కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో ఆయన రాజకీయ పార్టీల ప్రతినిధులతో సమావేశాన్ని నిర్వహిం చారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ స్పెషల్ సమ్మరి రివిజన్‌లో భాగంగా ఈనెల 6న ఓటరు జాబితా ప్రచురితం కాగా అభ్యంతరాల కోసం ఈ నెల 22 వరకు అవకాశముందన్నారు. నకిలీ, చనిపోయిన వారి పేర్లను తొలగించి అర్హులైన వారిని ఓటరు జాబితాలో నమోదు చేయించాలన్నారు. ఓటరు జా బితా సవరణపై రాజకీయ పార్టీల నాయకులు ఓటర్లకు అవగాహన కల్పించాలన్నారు. రాజకీయ పార్టీలు బూత్‌స్థాయిలో ఏజెంట్లను నియమించుకుని.. ప్రస్తుతం ఉన్న పోలింగ్ కేంద్రాలను క్షేత్ర స్థా యిలో పరిశీలించుకోవాలని సూచించారు. 1450పైచిలుకు ఓట ర్లు కలిగిన చోట కొత్త పోలింగ్ స్టేషన్‌ను ఏర్పాటు చేయాలన్నారు. నియోజకవర్గం వారీగా ప్రతివారం పొలిటికల్ లీడర్లతో మీటింగ్ నిర్వహించి అన్ని విషయాలను వెల్లడిస్తామన్నారు. ఈనెల 20, 21 తేదీల్లో అన్ని పోలింగ్ కేంద్రాల్లో స్పెషల్ క్యాంపెయిన్‌లను నిర్వహిస్తామని..అక్కడ ఓటరు జాబితాతోపాటు బీఎల్వోలు అందుబాటులో ఉంటారన్నారు. 18 ఏండ్లు నిండిన ప్రతి ఒక్క రూ తమ ఓటు హక్కును నమోదు చేయించుకోవాలని పిలుపునిచ్చారు. అనంతరం అదనపు కలెక్టర్ ప్రతిమాసింగ్ మాట్లాడు తూ అసెంబ్లీ ఎన్నికల మాదిరిగానే పార్లమెంట్ ఎన్నికలు కూడా సక్సెస్ అయ్యేలా రాజకీయ పార్టీల నాయకులు సహకరించాలన్నారు. కార్యక్రమంలో డీఆర్వో సంగీత, ఎన్నికల విభాగం అధికారులు, పలు పార్టీల ప్రతినిధులు, అధికారులు పాల్గొన్నారు.

# ఘనంగా గంధోత్సవం

- ప్రారంభమైన జహంగీర్‌పీర్ దర్గా ఉర్సు
- ప్రత్యేక ప్రార్థనలు చేసిన షాద్‌నగర్ ఎమ్మెల్యే శంకర్

కొత్తూరు, జనవరి 18 : జహంగీర్‌పీర్ దర్గా గంధోత్సవాన్ని గురువారం ఘనంగా నిర్వహించారు. షాద్‌నగర్ ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్, సీడబ్ల్యూసీ ప్రత్యేక ఆహ్వానితుడు వంశీచంద్‌రెడ్డి ప్రత్యేక ప్రార్థనలు చేసి ఊరేగింపుగా తీసుకెళ్లి దర్గాకు గంధాన్ని సమర్పించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ జేపీ దర్గా మతసామరస్యానికి ప్రతీకగా నిలుస్తుందన్నారు. ఈ దర్గాకు వచ్చి ప్రత్యేక ప్రార్థనలు చేస్తే కోర్కెలు నెరవేరుతాయన్నారు. అందుకే ప్రతిఏటా వేలాదిగా భక్తులు వచ్చి తమ మొక్కు లను చెల్లించుకుని కందూర్లు చేస్తారన్నారు. దర్గా అభివృద్ధికి కాంగ్రెస్ ప్రభుత్వం కట్టుబడి ఉందని ఆయన స్పష్టం చేశా రు. దర్గాను నమ్ముకొని ఎంతోమంది పేద వ్యాపారులు నివసిస్తున్నారని.. వారందరినీ దృష్టిలో ఉంచుకొని దర్గా మాస్టర్ ప్లాన్‌ను అమలు చేస్తామన్నారు. దర్గా ఉర్సు సందర్భంగా పోలీసులు పటిష్ట బందోబస్తును ఏర్పాటు చేశారు. మూడు వైపులా వాహనాల పార్కింగ్ కోసం ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. భక్తులకు ఇబ్బందుల్లేకుండా చర్యలు చేపట్టారు. దర్గాను సందర్శించిన వారిలో మాజీ ఎమ్మెల్యే ప్రతాప్‌రెడ్డి, వక్ఫ్‌బోర్డు అసిస్టెంట్ సెక్రటరీ అమీద్ అహ్మద్, మాజీ జడ్పీటీసీ శ్యాంసుందర్‌రెడ్డి, రవిగుప్తా, రషీద్, దర్గా సూపరింటెండెంట్ అబ్దుల్ సత్తార్ పాల్గొన్నారు.



జహంగీర్‌పీర్ దర్గా ఉర్సుకు వచ్చిన భక్తులు

## ఎరువుల విక్రయాలపై
# పటిష్ట నిఘా

**జిల్లాలో ప్రస్తుతం ఎరువుల నిల్వలు ఇలా..**

| ప్రొడక్ట్ | స్టాక్ (మెట్రిక్ టన్నుల్లో) |
|---|---|
| కాంప్లెక్స్ | 19,107.178 |
| యూరియా | 9,716.583 |
| డీఏపీ | 2,990.150 |
| ఎంవోపీ | 2,161.750 |
| ఎస్ఎస్‌పీ | 422.450 |

- ప్రత్యేక యాప్‌లో స్టాక్ వివరాల ఎంట్రీ
- కొనసాగుతున్న అధికారుల ముమ్మర తనిఖీలు
- ఎరువుల కొరత లేకుండా వ్యవసాయ శాఖ పకడ్బందీ చర్యలు

రంగారెడ్డి, జనవరి 18 (నమస్తే తెలంగాణ): ప్రతి సీజన్‌లోనూ పంటల లెక్కలను పక్కాగా గణిస్తున్న వ్యవసాయ శాఖ ఇకపై ఎరువుల లెక్కలను సైతం ఎప్పటికప్పుడు తేల్చేందుకు చర్యలు తీసుకుంటున్నది. ఎరువుల సరఫరా, నిల్వలు, విక్రయాల నిర్వహణకు సంబంధించిన వివరాలు ఇప్పటివరకు కాగితాలపై మాత్రమే నమోదు చేయడంతో పారదర్శకత ఉండేది కాదు. ఈ క్రమంలో ఎరువుల వివరాలన్నింటినీ పంటల నమోదుకు సంబంధించిన యాప్‌లో నమోదు చేస్తున్నారు. జిల్లా అధికారి నుంచి మండల స్థాయి వరకు నిత్యం ఎక్కడో ఒక చోట దుకాణాల తనిఖీలను నిర్వహించి జిల్లాలో ఎరువుల విక్రయాలు, నిల్వల వివరాలను నిరంతరం పరిశీలిస్తున్నారు.

### ముందే ప్రణాళిక రూపొందించినా..

ప్రతి సంవత్సరం యాసంగి, వానకాలం సీజన్ల ఆరంభంలోనే ఎరువులకు సంబంధించిన ప్రణాళికను వ్యవసాయ శాఖ ఖరారు చేస్తున్నది. ఆ సీజన్‌కు ఎన్ని టన్నుల ఎరువులు అవసరమో అంచనా వేసి అందుకనుగుణంగా ఎరువులను సిద్ధం చేసి ఉంచుతున్నది. బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో పక్కా ప్రణాళికతో ఎరువుల కోసం రైతులు పడే ఇబ్బందులు తీరాయి. ఎరువుల సరఫరా, నిల్వలు, విక్రయాల నిర్వహణలో మరింత పారదర్శకత ఉండేలా వ్యవసాయ శాఖ చర్యలు తీసుకుంటున్నది. ఇందులో భాగంగానే కొద్ది రోజులుగా సంబంధిత అధికారులు జిల్లాలోని అన్ని ఎరువుల దుకాణాలను సందర్శించి స్టాక్ వివరాలను ఆన్‌లైన్‌లో నమోదు చేస్తున్నారు. మండలాల్లో క్వాలిటీ కంట్రోల్ ఇన్‌స్పెక్టర్లుగా వ్యవహరిస్తున్న ఏవోలు వారంలో మూడు రోజులపాటు విధిగా ఎరువుల దుకాణాలను సందర్శించాల్సి ఉంటుంది. జిల్లా వ్యవసాయ అధికారితోపాటు, డివిజన్ స్థాయి అధికారులు సైతం నిర్దేశించిన రోజుల్లో దుకాణాలను సందర్శించి తనిఖీలు నిర్వహిస్తున్నారు. యాప్‌లో వివరాలను నమోదు చేయడం వల్ల ఎక్కడ స్టాక్ కొరత ఏర్పడనున్నదో? ముందుగానే తెలుసుకొని ముందస్తుగా తగు చర్యలు తీసుకునేందుకు అవకాశం ఉన్నది.



### సీజన్‌కు ముందే నిల్వలు..

ఎట్టి పరిస్థితుల్లోనూ యూరియాతోపాటు ఇతర ఎరువుల కొరత లేకుండా జిల్లా వ్యవసాయ శాఖ పక్కా ప్రణాళికతో ముందుకెళ్తున్నది. కృత్రిమ కొరత సృష్టించే వ్యాపారులపై నిఘా పెట్టడంతోపాటు ఎరువుల అమ్మకాలు, స్టాక్ వివరాలు పూర్తిగా యాప్‌లో నమోదు చేయాలని వ్యవసాయ మండల అధికారులకు ఉన్నతాధికారులు ఆదేశాలు జారీ చేశారు. యాసంగి సీజన్ చివరి వరకు కూడా రైతులకు ఎరువుల కొరత రాకుం డా చూడడంతోపాటు వచ్చే వానకాలం సీజన్‌కు ముందే సమృద్ధిగా ఎరువుల నిల్వలు ఉండేలా అధికారులు చర్యలు తీసుకుంటున్నారు.